క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

పెనుగొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంచిలిలో అలూరి చిన్నారావు సోదరులు ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, సర్పంచ్ గణేషుల శేషవేణి, విగ్రహ దాతలు అలూరి చిన్నారావు, కేతా మీరయ్య, సిర్రా బాలాజీ, చిలుకూరి సీతారామ్, జవ్వాది బాలాజీ, తమ్మినీడి ప్రసాద్, నక్కా వేదవ్యాస శాస్త్రిరి, నక్కా వినోద్‌కుమార్ శర్మలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో చదువుతున్న ముగ్గురు దివ్యాంగ విద్యార్థులు వికలాంగుల ఉపకరణాల ఎంపిక, పంపిణీ కార్యక్రమంలో ల్యాప్‌టాప్‌లు అందుకున్నారు. ల్యాప్‌టాప్‌లు అందుకున్న చేగొండి భరత్‌సాయి (బీఎస్సీ ద్వితీయ సంవత్సరం), మాంద్రు యొహోషువా (బీఎస్సీ తృతీయ సంవత్సరం), బందు వంశీకృష్ణ (బీకామ్ తృతీయ సంవత్సరం)లను సోమవారం ప్రిన్సిపాల్ తిరువీధుల రాజ రాజేశ్వరి అభినందించారు. అధ్యాపకులు పితాని శ్రీనివాసరావు, వింజమూరి శిరీష సూపరింటెండెంట్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ అందజేత



వాటర్ ట్యాంక్ అందిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న డయాలసిస్ కేంద్రానికి వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంకును వాకర్స్ క్లబ్ తరపున సోమవారం అందజేశారు. దీనిని డయాలసిస్ కేంద్రాల జోనల్ ఇన్‌చార్జి వీరా సుదీర్‌కు క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు ఆసుపత్రి ఆవరణలో అందించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగం తగ్గించాలి



పోస్టర్‌ను విడుదలచేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని వ్యవసాయ ఆధారిత భూములలో ఎరువుల వినియోగం తగ్గించి పచ్చిరొట్ట వినియోగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ×పచ్చిరొట్ట పైర్లకు వాడడం ద్వారా చేకూరే ప్రయోజనాలప్తై గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అధిక ఎరువులు వినియోగం కారణంగా భూసారం దెబ్బతిని జీవం కోల్పోవడంతో భూమి సాగుకు పనికి రాకుండా పోతుందన్నారు. పచ్చిరొట్ట ఎరువుతో మట్టికి జీవం వస్తుందన్నారు. వర్షాకాలానికి ముందు పొడి విత్తనాలను వెదజల్లడం ద్వారా పచ్చి రొట్టె ఎరువులు పొందవచ్చు అన్నారు. నేలసారం పెంపు, ఆరోగ్యకరమైన నేల, పోషకాలు వృథా తగ్గుతుందన్నారు. సాగు ఖర్చులు తగ్గిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంగా ఉండాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ఆరోగ్యవంతమైన సమాజానికి ఔషధ నిపుణులు భాగస్వామ్యం కావాలని పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం జోన్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాంటీబయాటిక్స్, నార్కోటిక్స్, డ్రగ్స్ అవగాహనా సదస్సును సోమవారం భీమవరం ఆనంద్ ఇన్ నందు సోమవారం నిర్వహించారు. ముందుగా ఔషద తనిఖీ అధికారి కార్యాలయం నుంచి ఆనంద ఇన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆనంద్ ఇన్ నందు నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొన్న పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య వంతమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు.

మట్టిని తొలగించండి మహాప్రభో!

- లక్ష్మీపాలెం ఏటిగట్టు రోడ్డుపై పేరుకుపోయిన మట్టి
- రాకపోకలకు ఇబ్బందులు

యలమంచిలి: మండలంలోని లక్ష్మీపాలెం వద్ద ఇటీవల ఏటిగట్టు అభివృద్ధి చేయడంతోపాటు, బ్రాంచి కెనాల్ వంతెనకు రివిట్‌మెంట్ నిర్మించారు. రివిట్‌మెంట్ కట్టడానికి ముందు పునాదుల కోసం తవ్విన మట్టిని రోడ్డు మార్జిన్‌లో వేసి వదిలివేశారు. ఇప్పుడు వర్షాలకు మార్జిన్‌లో ఉన్న మట్టంతా కరిగి రోడ్డుపైకి చేరింది. ఆరంగుళాల మందాన మట్టితో నిండి వర్షపు నీటికి బురదగా తయారైంది. ఆ ప్రదేశంలో రోడ్డుపై నుంచి వంతెన ఎక్కడానికి తొంబై డిగ్రీల వంపుతో రోడ్డు ఏటవాలుగా ఉంటుంది. రోడ్డు ఏటవాలు, వంపులకు తోడు బురద సమస్య రావడంతో ద్విచక్ర వాహన చోదకులతోపాటు నడిచి వెళ్లే వారు కూడా జారిపడిపోతున్నారు. అభివృద్ధి పనుల పేరుతో ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా రోడ్డుపై ఇలా మట్టి పేరుకుపోయినా మట్టి తొలగించే పనులు చేపట్టకపోవడంపై లక్ష్మీపాలెం గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బురద వల్ల కాన్వెంట్ వాహనాలు గ్రామంలోకి వెళ్లడం లేదు. వంతెన ఇవతల వాహనాలు నిలుపుతున్నారు. గ్రామంలో ఉన్న విద్యార్థులంతా కిలో మీటరు మేర బురదలో నడిచి వచ్చి వాహనం ఎక్కుతున్నారు. ద్విచక్ర వాహన దారులైతే బురద మట్టిలో ప్రయాణం చేయలేక ఐదు కిలో మీటర్లు అదనంగా గంగడుపాలెం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

అధ్వానంగా వడ్డిలంక ఇసుక ర్యాంపు రోడ్డు

వర్షాలకు వడ్డిలంక ఇసుక ర్యాంపు రోడ్డు అధ్వానంగా మారింది. ఇక్కడ మెటల్ రోడ్డు ఉంది. వర్షాలకు మెటల్ మధ్య ఉన్న గ్రావెల్ కొట్టుకుపోవడంతో నల్ల మెటల్ మొనలు పైకి తేలాయి. దీంతో ద్విచక్ర వాహనాల టైర్లు పంక్చర్ అవుతున్నాయని లక్ష్మీపాలెం, వడ్డిలంక గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డుపై పాదచారులు సైతం నడచి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి లక్ష్మీపాలెం వంతెన వద్ద రోడ్డుపై పేరుకుపోయిన బురద తొలగించడంతోపాటు, వడ్డిలంక ర్యాంపుకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలించాలని ప్రజలు కోరుతున్నారు.



లక్ష్మీపాలెం ఏటిగట్టు వద్ద బురదమయమైన రోడ్డు



వడ్డిలంక వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

ఎన్టీఆర్ కాలనీ రోడ్డు అధ్వానం

నరసాపురం: స్థానిక ఎన్టీఆర్ కాలనీ గ్యాస్ గొడౌన వెనుక ప్రాంతంలో పక్కారోడ్డు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వారి ఇబ్బందులు వర్ణనాతీతం. కాలనీలో దాదాపు 300 కుటుంబాలు ఉన్న ప్రధాన ప్రాంతంలో ఎప్పటి నుంచో మట్టిరోడ్డు ఉంది. దీనిని తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని స్థానికులు అనేకసార్లు మున్సిపల్ అధికారులను కోరారు. కాలనీలో ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా న్యాయశాఖ ఉద్యోగులు ఎక్కువమంది నివాసం ఉంటున్నారు. పక్కా రోడ్డు లేకపోవడం, వీధి దీపాల సదుపాయం కూడా అంతంతమాత్రంగా ఉండటంతో రాత్రయితే పాములు కూడా రోడ్డుపైకి వస్తున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య స్థానికుల ఫిర్యాదుతో అనేకసార్లు వచ్చి చూసి వెళ్లడం తప్పిస్తే, రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయడం లాంటి చర్యలు చేపట్టలేదని స్థానికుడు, బ్యాంకు ఉద్యోగి నంద్యాల బాలాజీ వాపోయారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.



రోడ్డు వేయాల్సిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అంజయ్య (ఫైల్)

మిథున్‌రెడ్డి అరెస్టుపై ఆగ్రహం

మార్టేరులో వైఎస్సార్ సీపీ ధర్నా

పెనుమంత్ర: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు ఖండిస్తూ సోమవారం సాయంత్రం మార్టేరు సెంటర్లో వైఎస్సార్ సీపీ ఆచంట నియోజకవర్గం శ్రేణులు నిరసన వ్యక్తం చేశాయి. ఈ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్, మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు, కాటన్, వైయస్ రాజశేఖరరెడ్డిల విగ్రహాలకు పూలమాలవేసి నిరసన ప్రదర్శన ప్రారంభించారు. కార్యక్రమంలో పెనుమంత్ర, పోడూరు జెడ్పీటీసీ సభ్యులు కర్రి గౌరీ సుభాషిని, గుంటూరి పెద్దిరాజు, బహుజన కులాల రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్‌లు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన నానాటికి పెచ్చుమీరుతోందని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని, ప్రశ్నించిన వారి నోరు నొక్కేందుకు అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని, సాక్షాత్తూ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ టీడీపీ కక్ష సాధింపు చర్యలకు నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. కార్యక్రమంలో పార్టీ పెనుమంత్ర, పోడూరు, ఆచంట, పెనుగొండ మండలాల అధ్యక్షులు గూడూరి దేవేంద్రుడు, పిల్లి నాగన్న, జక్కంశెట్టి శ్రీను, చిన్నం బాబి వర్ధన్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కొవ్వూరు వేణుమాధవ్ రెడ్డి, సీనియర్ నాయకులు అల్లం బుల్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, కొవ్వూరు బ్రహ్మేశ్వర్ రెడ్డి, సత్తి విష్ణు కుమార్ రెడ్డి, సత్తి సుబ్బారెడ్డి, ఉన్నమట్ల మునిబాబు, పెనుగొండ ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షులు గుడిమెట్ల సాయి మురళీరెడ్డి, గ్రామ సర్పంచులు మట్ట కుమారి రాము, జక్కంశెట్టి చంటి, బుర్ర రవికుమార్, తవనంపూడి వీరెడ్డి, కోట వెంకటేశ్వరరావు, సుంకర సీతారాం, జక్కంశెట్టి శ్రీరాములు, గ్రామ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అరెస్ట్ దుర్మార్గం



బుడితి సుమన్

నరసాపురం: వైఎస్సార్ సీపీ నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ దుర్మార్గమని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా కన్వీనర్ బుడితి సుమన్ ఖండించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటుతున్నా ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని పక్కన పెట్టి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. రాజధాని పేరుతో అమరావతిలో ఒకదపా వేలాది ఎకరాలు సేకరించి పేద రైతుల కడుపుకొట్టిన చంద్రబాబు, మళ్లీ ఇప్పుడు కూడా వేలాది ఎకరాలు భూములు లాక్కుని తమ అనుయాయులకు కట్టబెట్టాలని చూస్తున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలు గుర్తించారని, ఇవి చంద్రబాబు సొంత సర్వేల్లోనూ తెలిందని, ఈనెపథ్యంలో ప్రజల దృష్టిని మరల్చడానికి అక్రమ కేసుల డ్రామాలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రజలను మోసం చేయడం మానుకుని సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చాలని సుమన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జనం దృష్టి మళ్లించడానికే..



పాలసత్తి రాజా

పెనుగొండ: కక్ష సాధింపులో భాగంగానే ఎటువంటి స్కాంలు లేకపోయినా రాష్ట్రంలో అరెస్టులు చేస్తున్నారని, ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ దారుణమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు పాలసత్తి రామిరెడ్డి (రాజా) విమర్శించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగుతోందన్నారు. లిక్కర్ స్కాంలో ఎటువంటి ఆధారాలు లభించకపోయినా అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. పాలన గాలికొదిలి కేవలం కక్షసాధింపులపైనే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్, సంక్షేమ పథకాలు అమలులో విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజల దృష్టి మళ్లించడానికే అరెస్టులు చేస్తున్నారని తెలిపారు.

కేసులు అన్యాయం



గోవింద రాజులు నాయుడు

పాలకొల్లు సెంట్రల్: ఎంపీ మిథున్‌రెడ్డిపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేసి జైలుకి పంపడం అన్యాయమని జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవింద రాజులు నాయుడు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. మిథున్‌రెడ్డిపై కేసులు కోర్టులో వీగిపోవడం ఖాయమని తెలిపారు. ఆయన తన నిజాయితీని కోర్టులో నిరూపించుకుని కడిగిన ముత్యంలా మళ్లీ ప్రజా క్షేత్రంలోనికి వస్తారన్నారని పేర్కొన్నారు.

విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నడుస్తున్నాయని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం సూరిబాబు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో డిస్కం అధ్యక్షులు జె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు వేసేలా పాలకుల విధానాలు ఉన్నాయని విమర్శించారు. ఉద్యోగులపై పని భారం పెరుగుతుందన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజుఫర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో  భారీ వర్షం

నీట మునిగిన అన్నపూర్ణ థియేటర్ రోడ్డు

నరసాపురం: బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో సోమవారం వాతావరణం ఒక్కసారిగా మారింది. ఆషాఢమాసంలో కొద్ది రోజులగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వేడి ఉక్కబోతతో సతమతమవుతున్న ప్రజలు వర్షంతో సేదతీరారు. మధ్యాహ్నం 12 గంటలు నుంచి చిరుజల్లులు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటల సుమారు గంట పాటు పడిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగిపొర్లాయి. పట్టణంలో ప్రధాన సెంటర్లలో మోకాలు లోతు నీరు చేరింది. బస్టాండ్, స్టీమర్‌రోడ్డు, ప్రకాశంరోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఇళ్లకు చేరుకోవడానికి నానాఅవస్థలు పడ్డారు. ఫుట్‌పాత్ వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గర్భిణులకు ఆసుపత్రిలో సహజ కాన్పు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం ముగ్గురు గర్భిణులు సహజ కాన్పులో ముగ్గురు మగ శిశువులకు జన్మనిచ్చారు. మహిళలకు పురుడు పోసిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యర్రా మాధురి మాట్లాడుతూ సహజ కాన్పులను ప్రోత్సాహించాలన్న ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తూ ఈ ఆసుపత్రిలో మహిళలు గర్భం ధరించిన నాటి నుంచి తగిన సలహాలు, సూచనలు ఇస్తూ సహజ కాన్పులయ్యే విధంగా చూస్తున్నట్టు చెప్పారు. ముగ్గురు మగ పిల్లలు పూర్తి ఆరోగ్యంగా జన్మించారన్నారు. ఎ హరిత అనే గర్భిణీకి 3.8 కిలోల మగ పిల్లాడికి కూడా సహజ కాన్పు అయ్యేలా చేశామని తెలిపారు. గర్భం ధరించిన మహిళలంతా ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించుకుని డబ్బు ఖర్చు లేకుండా సుఖ ప్రసవాలు చేసుకోవాలని ఆమె కోరారు.



బాలింతలతో డాక్టర్ మాధురి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన మోటార్ సైక్లిస్టు రామకృష్ణ



గాయపడిన విద్యార్థిని వైష్ణవి

పెనుమంత్ర: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పెనుమంత్ర మండలం బ్రాహ్మణ చెరువు గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని పి.వైష్ణవి (12) పెనుమంత్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సైకిల్‌పై వెళుచుండగా పెనుమంత్ర సంత మార్కెట్ వద్ద అత్తిలి గ్రామానికి చెందిన కె.రామకృష్ణ (37) మోటార్ సైకిల్‌తో బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ కింద పడిపోవడంతో ఇద్దరికీ కాళ్లు విరిగిపోయాయి. వెంటనే స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహన ఘటనా స్థలికి వచ్చింది. మెడికల్ టెక్నీషియన్ బాలకృష్ణ, పైలట్ మహేష్ సహకారంతో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం తణుకులోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

అమ్మవార్లకు సారె సమర్పణ

పెనుగొండ: రెండో శ్రీరంగంగా పేర్గాంచిన కొఠాలపర్రులోని స్వయంభూ కేశవ స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవీ అమ్మవార్లకు, గ్రామ దేవత పోలేరమ్మకు, ఇతర ఆలయాలకు ఆషాఢ మాసం సారె సమర్పించారు. సోమవారం ఉదయం నుంచి గ్రామాల్లో ఆషాఢ సారెతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు శ్రీదేవివీ, భూదేవి, గ్రామ దేవత పోలేరమ్మ, పోతురాజు ఆలయానికి, రామాలయం, ఆంజనేయ స్వామి ఆలయాల్లో సారెను సమర్పించారు. ఈ సందర్భంగా పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



శ్రీదేవి, భూదేవిలకు సారె సమర్పిస్తున్న భక్తులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 ఫిర్యాదులు

ఆకివీడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 అర్జీలు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు తెలిపారు. కుమారులు సక్రమంగా చూడటంలేదని రాజామణి, సరిహద్దుదారుడు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని గంగానమ్మకోడు ప్రాంతంలోని తెలగపాముల గృహ నివాసి మేకల తిమోతి ఫిర్యాదు చేశారన్నారు. చినకాపవరం డ్రెయిన్ ప్రాంతం ఉప్పుటేరు పడమరవైపు గట్టు ప్రాంతంలో ఆక్రమణ చేసి చేపల చెరువు తవ్వారని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మోరా రామిరెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రుల పనితీరుపై వైద్య ఆరోగ్య శాఖ తనిఖీలు చేయాలని రామిరెడ్డి అర్జీ అందజేశారు. సిద్ధాపురం గ్రామంలోని పంట కాల్వకు చేర్చి అనుమతి లేని రొయ్యల చెరువులకు బోర్లు తవ్వుతున్నారని, తమ గ్రామంలోని మంచినీటి చెరువుకు కలుషిత నీరు వచ్చే ప్రమాదం ఉందని మాజీ సర్పంచ్ తోట శివాజీ ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ తెలిపారు.

రేపు వైఎన్ కళాశాలలో ఉద్యోగ దిక్సూచి

నరసాపురం: వైఎన్ కళాశాల హెచ్ఆర్డీ సెంటర్‌లో ఈనెల 23న ఉద్యోగ దిక్సూచి మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ డ్రైవ్‌లో 15 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని, దాదాపు 700 మందికి ఉద్యోగ పత్రాలు అందించే విధంగా ప్రణాళిక తయారు చేశామని పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 94508 38388, 95020 24765లో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ సహాయ సంచాలకులుగా మురళీకృష్ణ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు వ్యవసాయ సహాయ సంచాలకులుగా పలివెల మురళీకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తాడేపల్లిగూడెం సహాయ సంచాలకులుగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు గతంలో ఇక్కడ పని చేసిన అనుభవం ఉంది.

రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ శిక్షణ



శిక్షణను ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించినట్టు స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ తెలిపారు. 15 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కళాశాల ట్రెజరర్ కేవీ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన సొసైటీ త్రీమెన్ కమిటీ

పెనుగొండ: వడలిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రీమెన్ కమిటీ సోమవారం బాధ్యతలు స్వీకరించింది. చైర్మన్‌గా కట్టా వెంకట రామకృష్ణ (వడలి), సభ్యులుగా యర్రంశెట్టి గోపాల మధుసూదనరావు (రామన్నపాలెం), పిల్లి శ్రీనివాస్ (వెంకట్రామపురం) ప్రమాణ స్వీకారం చేశారు. రైతుల శ్రేయస్సు కోసం పాటుపడతామన్నారు. గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, రైతులు, సహకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వేమవరం సొసైటీ పాలకవర్గం

పెనుగొండ: ఆచంట వేమవరం సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా నెక్కంటి సత్తిబాబు, సభ్యులుగా జక్కంశెట్టి శ్రీనివాసు, సిర్రా అమరకుమార్‌లచే కార్యదర్శి అరిమిల్లి వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలి

భీమవరం (ప్రకాశంచౌక్): భావితరాలకు బంగారు భవిష్యత్ అందించాలంటే ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్ అన్నారు. భీమవరం ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పర్యావరణానికి ప్రమాదంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధ కమిటీ జిల్లా సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కేవలం ప్రభుత్వ ఉత్తర్వుల వల్ల ఇది సాధ్యం కాదని, స్వచ్ఛందంగా సామాజిక బాధ్యతతో ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలంతా నడుం బిగించాలని, ప్లాస్టిక్ అంతానికి ఈరోజే ముందడుగు వేయాలని తెలిపారు. అనంతరం ప్రయాణికులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరీ దేవికి వెండి సమర్పణ



అమ్మవారికి వెండి సమర్పిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి దేవి మకర పీఠానికి సోమవారం దాతలు 100 గ్రాముల వెండి విరాళంగా అందజేశారు. పట్టణానికి చెందిన జవ్వాది విజయ సాయి సత్యనారాయణ, శ్రీదుర్గ దంపతులు 100 గ్రాముల వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.